www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 జూన్ 2025
5
చిత్తూరు



మోడల్ మాయ!

విద్యా వ్యవస్థలో సమూల మార్పులంటూ కూటమి ప్రభుత్వం మోడల్ బడులతో గ్రామీణ బడులు మాయం కానున్నాయా? అంటే ఇటీవల తమ గ్రామ బడులు మూసేస్తున్నారంటూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలే నిదర్శనం..మా ఊరి బడులు మార్చొందంటూ కలెక్టరేట్ ఎదుట గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదకు జీడి నెల్లూరు నియోజవర్గం నుండి మూడు గ్రామాలకు చెందిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు 'మా ఊడి బడి మార్చొద్దు..' అంటూ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా తమ గ్రామ బడులు మార్చొందంటూ నిరసనలు వ్యక్తమతున్నాయి.

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 2025-26 లో మోడల్ పాఠశాలల పేరిట ప్రభుత్వం గుర్తించిన గ్రామ పంచాయతీల్లో 997 మోడల్ పాఠశాలలు ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి ప్రతి మోడల్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని ఇటీవల నిర్వహించిన బదిలీలలో నియమించారు. ప్రతి మోడల్ పాఠశాలకు మొదట్లో 60 మంది విద్యార్థులుండాలని నిర్ణయించినా కనిసం 40 మంది విద్యార్థులుండేలా చూసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం నుండి జిల్లా విద్యాశాఖకు ఆదేశాలందాయి. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న మోడల్ పాఠశాలల్లో సమీపంలోని ఒక కిలో మీటరు దూరంలోని పాఠశాలల నుండి 3,4,5 తగతుల విద్యార్థులను విలీనం చేయాలని నిర్ణయించారు. అయితే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల్లో 3,4,5 తరగతులను కుదించి అక్కడి విద్యార్థులను మోడల్ పాఠశాలలకు రావాలంటున్నారని విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తన కుమార్తె అనారోగ్యంతో కాళ్లు బొబ్బలతో మూడు కిలో మీటర్లు ఎలా వెళుతుందని ప్రశ్నిస్తున్న తల్లి సుకన్య

గ్రామీణ బడులకు గ్రహణం

గ్రామీణ బడులకు గ్రహణం

ప్రభుత్వం మోడ ల్ పాఠశాల పేరిట విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి ఏర్పాటు చేస్తున్న బడులతో గ్రామీణ బడులు మాయం కానున్నాయి. ఐదో తరగతి వరకు ఉన్న బడులను 3,4,5 తరగతులు మార్చడం వల్ల ఒకటి, రెండు తరగతులుగా మిగిలే బడులు రానున్న రోజులు మూతపడనున్నాయి. తమ గ్రామంలో బడి నుండీ 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు వెళ్లి చదువుకోవడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తరగతి గదుల కుదింపు, పాఠశాల విలీనానికి పాఠశాల యాజమాన్య కమిటీ ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధన ఉన్నా ఏమాత్రం పాటించడం యాజమాన్య కమిటీ నుండి ఎలాంట అనుమతి తీర్మానం లేకుండా జిల్లా విద్యాశాఖ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందంటూ పాఠశాల యాజమాన్య కమిటీలు ఆరోపిస్తున్నాయి. జీడి నెల్లూరు మండలం నెల్లేపల్లి పంచాయితీ కొత్తూరు దళిత వాడలోని 1 నుండి 5 తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాల్లో 3,4,5 తరగతులను 3 కిలో మీటర్ల దూరంలోని నెల్లేపల్లికి మార్చారు. ఇక్కడ పాఠశాల యాజమాన్య కమిటీ అనుమతి ఏమాత్రం తీసుకోలేదు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,738 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 2,85,900 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారు. మోడల్ పాఠశాలల పుణ్యమా అంటూ గ్రామీణ బడులు మూతపడనున్నాయి. మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న మోడల్ బడులకు తమ పిల్లలను పంపలేక అనేక గ్రామాల్లో తమ పిల్లలన్ని ప్రయివేటు బడులకు మార్చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించించాలని గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై విలీన పాఠశాల సమాచారం ఇచ్చేందకు జిల్లా విద్యాశాఖ అధికారులు దాటవేత ధోరణి అనుసరిస్తున్నారు. విలీన బడుల విషయాన్ని గోప్యంగా వుంచుతున్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాల మాకొద్దు..

అక్కన్నగారిపల్లి గ్రామస్తుల నిరసన



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఇటీవల ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ పాఠశాలకు తమ పిల్లలను పంపించేది లేదని, అక్కన్న గారి పల్లిలో వున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను జిడి నెల్లూరు మోడల్ ప్రైమరి స్కూలులో కలపడం అన్యాయమని ఆ గ్రామస్తులు పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కన్నగారి పల్లి పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులకు చెందిన విద్యార్థులను గంగాధర నెల్లూరు మోడల్ ప్రైమరీ పాఠశాలకు అక్కన్న గారి పల్లె విద్యార్థులు కలిపేయడం సరికాదన్నారు. తమ గ్రామంలోనే మూడు, నాలుగు, ఐదు తరగతులు ఇక్కడే ఉండి చదువుకుకునే అధికారులు స్పందించి అవకాశం కల్పించాలని గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు.

మా పాఠశాలను విలీనం చేయొద్దు..

బైరెడ్డిపల్లి: మండలంలోని బేలపల్లి పంచాయతీ పరిధిలోని ఆకుల కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను వేరే ఊరికి విలీనం చేయనున్నారని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంఈఓకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విచారణ త్వరగా చేసి గ్రామంలోని పాఠశాల ఒకటి రెండు తరగతులు విద్యార్థులు అక్కడే చదువు కోవచ్చని, మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థులు పక్క గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని వారికి ప్రభుత్వం రానుపోను ఛార్జీలు కూడా ప్రభుత్వమే అమ్మవాడిలా ప్రతి విద్యార్థికి ఇస్తారని తెలిపారు. ప్రభుత్వం వారి మెరుగైన విద్య కోసం పాఠశాల విలీనం చేశారని తమ పరిధిలో ఏమి లేదని నివేదిక ఉన్నత అధికారులకు పంపిస్తామని ఎంఈవో తెలిపారు.



వినతిపత్రం ఇచ్చేందుకు ఎంఈవో కార్యాలయానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

సమస్యల హైవే మాకొద్దు!

- 20 అడుగుల దూరానికి మూడు కిలోమీటర్లు వెళుతున్నాం..
- రహదారి వల్ల పిల్లలు స్కూలుకెళ్లడానికీ ఇబ్బంది
- రైతులకు, పాడి పశువులకూ కష్టాలు
- పరిష్కరించాలని గ్రామస్తుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న బండకిందపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి- రొంపిచర్ల: హైవే రహదారి నిర్మాణం కారణంగా తాము 20 అడుగుల దూరానికి మూడు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఈ రహదారి కారణంగా పిల్లలు స్కూలుకు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారిందని, రైతులు, పాడి పశువులు పొలం పనులకు రోడ్డు దాటేందుకు భయాందోళనకు గురి కావాల్సి వస్తోందని ఈ హైవే రహదారి మాకొద్దు.. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలం బండ కిందపల్లె గ్రామస్తులు తమ పిల్లలతో బడిని బహిష్కరించి ఆ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట శుక్రవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు నాలుగు వేల మందికి పైగా జనాభా వున్నారని, రొంపిచర్ల మండలంలో ఉన్న గ్రామాలలో ఎక్కువ జనాభా వున్న గ్రామం ఇదేనని, ఇలాంటి ఈ గ్రామంలో వున్న ప్రాథమికోన్నత 80 మంది పిల్లలు చదువుతున్నారన్నారు. గ్రామం మధ్యలో అనంతపురం- చెన్నై హైవే రోడ్డు నిర్మాణం సుమారు సంవత్సరకాలంగా సాగుతోంది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం చివర దశలో వుందని తెలిపారు. గ్రామంలోని రైతులు రోడ్డుకు దక్షిణం వైపు 370 కుటుంబాలు ఉన్నాయని వీరికి వ్యవసాయ భూములు రోడ్డుకు దక్షిణం వైపు సుమారు వెయ్యి ఎకరాల సాగుభూములు ఉన్నాయని పేర్కొన్నారు. పశువులు మేపుకునేందుకు, వ్యవసాయ పనుల నిమిత్తం రోడ్డు దాటాల్సిన అవసరం వుందని, విద్యార్థులు సైతం రోడ్డు దాటి పాఠశాలకు వెళ్లే పరిస్థితి వుందని, ఇప్పుడు ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా నాలుగు లైన్ల రహదారికి ఇరువైపులా ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల రాకపోకలు స్తంభించిపోయాయని తెలిపారు. విద్యార్థులు 20 అడుగుల రోడ్డు దాటి స్కూలుకి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వుందని ఆవేదన వ్యక్తం చేశారు. హైవే నిర్మాణంలో సరైన ప్లానింగ్ లేక అండర్ పాస్ నిర్మాణం అస్తవ్యస్తంగా మారిందని, హైవే అధికారులను గ్రామస్తులు అడుగడుగునా నిర్లక్ష్య ధోరణిలో 'మా ప్లానింగ్ లో మీ ఊరు లేదు. మాకు ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం మేము నిర్మాణం చేపడుతున్నాం. మీరు ఎవరికైనా చెప్పుకోండి' అని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు కలెక్టర్‌కి వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామస్తు లకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకుంటున్నారు. ఈ ధర్నాలో మైనారిటీ పెద్దలు మహమ్మద్ అలీ, వెల్డింగ్ షాప్ లాల్ బాషా, అహమద్ బాష, బారేషా, సయ్యద్ అలీ, అబ్దుల్ నబీ, సలీం, లాల్ బాషా, సుల్తాన్, డీకే రామిరెడ్డి, దొరబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లలను స్కూలుకు పంపేది లేదు..

దారి సౌకర్యం లేక పిల్లలను బడికి పంపలేము.. విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం పిల్లలను స్కూలుకు పంపకుండా ధర్నా చేశారు. చిన్నపిల్లలు రోడ్డు దాటి స్కూలుకు రావాలంటే ప్రమాదాల బారినబడే అవకాశం ఉందని, హైవే పైన అతివేగంగా వాహనాలు వెళుతుంటాయి.. ఏదైనా ప్రమాదాలు జరిగితే చిన్నపిల్లలు పరిస్థితి ఏమిటి? స్కూలుకు పంపలేమని ఖరా కండిగా చెప్పేశారు. రోడ్డు ఇంకా ఒక దశలో నిర్మాణంలోనే ఉన్న అన్ని వైపుల నుంచి అస్తవ్యస్తంగా వాహనాలు వెళ్తున్నాయని, చిన్నపిల్లలు భయపడి స్కూలుకు పోలేమని ఏడుస్తున్నారు అని అంటున్నారు.

రైతులు పొలాలకు వెళ్లాలంటే దారి సమస్య



రైతులు పొలాలకు వెళ్లాలంటే దారి సమస్య తీవ్రంగా వుంది. ఎవరైనా చనిపోతే శ్మశాన వాటికి వెళ్లాలన్నా మూడు కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి వుంది. రోడ్డుకు ఇవతల వైపు ప్రజలు వెళ్లడానికి వున్న సమస్యలపై హైవే అధికారులను అడిగితే 'చూస్తాం.. చేద్దాం..' అని అంటున్నారు. 'మీరేమైనా మాట్లాడా లనుకుంటే మీ గ్రామ సర్పంచ్‌ను అడిగి తెలుసు కోండి.. మేము సర్పంచిని సంప్రదించే వారి సూచన ప్రకారమే నిర్మాణం చేపట్టామని నిర్లక్ష్య సమాధానం చెబుతు న్నారు. గ్రామ సర్పంచ్ అవగాహన లేకుండా, గ్రామస్తులను ఎవరిని సంప్రదించకుండా చేశాడు. దయచేసి విద్యార్థులకు, వ్యవసాయ రైతులకు, పశువుల కాపరులకు దారి కల్పించాలని వేడు కుంటున్నాను.

- ఊటుకూరి కోటేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు, బండ కింద పల్లి.

పిల్లలను పంపాలంటే భయంగా వుంది



పిల్లలను బడికి పంపా లంటేనే భయంగా ఉంది. ఎటువైపు నుంచి ఏ ప్రమాదం సంభవి స్తుందో నని ఆందోళనగా ఉంది. విద్యార్థులు బడికి సక్రమంగా రావాలంటే సౌకర్యాలు కూడా కల్పించాలి.

- ఎస్ ఆస్మా, స్కూల్ విద్యా కమిటీ చైర్‌పర్సన్, బండ కింద పల్లి.

పిల్లలను స్కూలుకు పంపాలంటే భయమేస్తోంది..





పిల్లలను బడికి పంపలేక పోతున్నాం.. ఏ సమయానికి ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. వెంటనే హైవే రహదారి సమస్యను పరిష్కరించాలి.. **(స్థానికులు)**

మహిళపై దాడి కలచివేసింది : చింతా మోహన్



ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం మండలంలో మహిళపై జరిగిన దాడి తనను కలచివేసిందంటూ కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు చింతా మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పంలో పర్యటించిన ఆయన స్థానిక ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం నారాయణపురం గ్రామానికి చెందిన శిరీషను చెట్టుకు కట్టివేసి కొట్టడం బాధాకరమన్నారు. ఈ ఘటన మరువకముందే రాగిమానుమిట్ట గ్రామంలో నస్మాపై జరిగిన దాడితో మహిళలకు రక్షణ కరువైందనడానికి నిదర్శనమన్నారు. కారణం ఏదైనా మహిళలపై దాడి చేయడం అమానుషమన్నారు. కూటమి పాలనలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారిణి, సిబ్బందిని పలకరిస్తూ ఆరోగ్య కేంద్ర సౌకర్యాలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రానికి విచ్చేసే రోగుల సంఖ్యను, వారికి అందిస్తున్న సేవల పట్ల విచారించారు. పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని, వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఫ్రైడే డ్రైడే పాటిద్దాం



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ఫ్రైడేను డ్రైడేగా పాటిద్దామని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం చిత్తూరు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రశాంతి నగర్ పరిధిలోని కుక్కలపల్లె సచివాలయం, గాండ్లకొత్తూరు గ్రామంలో ఫ్రైడే డ్రైడే తనిఖీ నిర్వహించారు. దోమలు వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి, తదితర జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, "మలేరియా నివారణ మాసోత్సవాలు" సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సూపరువైజర్ నారాయణ ఎఎన్ఎంలు కుమారి, ద్రాక్షాయణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులందరికీ అందించాలి

సమగ్ర శిక్షా అభియాన్ పీవో



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులందరికి అందించాలని సమగ్ర శిక్ష చిత్తూరు అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకట రమణ పేర్కొన్నారు. పెనుమూరు మండలం లోని మోడల్ ప్రైమరీ పాఠశాలను, భవిత సెంటర్, మండల వనరుల కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింటును పరిశీలించారు. ప్రతి విద్యార్థికి విద్యార్థి మిత్ర కిట్ అందేట్లు చూడాలని సూచించారు. విద్యార్థుల నమోదు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు గురించి పెనుమూరు మండల ఎంఈఓ 2 భాస్కర్ నాయుడుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 వి భాస్కర్ నాయుడు, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం బి యామిని, టీచర్ పి అనురాధ సిఆర్ఎంటి, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ యోగా దినోత్సవం

8.10 లక్షల మంది యోగా ఆసనాలు : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : శనివారం నిర్వహించనున్న 11వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి శనివారం నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత నెల 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ లో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు అందరి అధికారుల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమాలను చక్కగా నిర్వహించారని అందుకు అధికారులను అభినందిస్తున్నామన్నారు. నేడు పపంచ యోగ దినోత్సవాన్ని జిల్లాలో 5,808 ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మామిడి రైతులు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి -యాదమరి (చిత్తూరు), పూతలపట్టు, గంగాధర నెల్లూరు, కార్వేటినగరం: జిల్లాలోని తోతాపురి మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కార్వేటినగరంలోని అన్నార్ ఏబిసి మార్కెట్ కంపెనీలో, చిత్తూరు శ్రీరామ్ ఫుడ్ కంపెనీ, పూతలపట్టు లోని గల్లా శ్రీ సన్నిధి మామిడి గుజ్జు పరిశ్రమలో, గంగాధర నెల్లూరు మండలంలోని జైన్ కంపెనీలలో ఆయా కంపెనీల ప్రతినిధులతో, ఆయా కంపెనీల వద్ద మామిడి విక్రయానికి వచ్చిన రైతుల సమస్యలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కంపెనీ ప్రతినిధులతో ధరల విషయంపై చర్చించారు. కార్వేటి నగరంలోని అన్నార్ ఏ బీసీ కంపెనీలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుం టుందని ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తలు వల్ల మామిడి దిగుబడి పెరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, యుక్రేయన్ యుద్ధం వల్ల మామిడి పల్ప్ ఎగుమతి తగ్గిందన్నారు. పక్క రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలో క్రిష్ణగిరి మార్కెట్ నుంచి మార్కెట్ గుజ్జు పరిశ్రమల నుంచి పార్లే , కోకోకోలా, పెప్సీ కంపెనీ వాళ్లు ఎక్కువగా కొనుగోలు చేశారని తెలిపారు. ఈ కారణంగా గత రెండు సీజన్ లోను గుజ్జు నిల్వలు పేరుకుపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారులు గుజ్జు పరిశ్రమలు, రైతులు, రైతు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి తెలిపామని పేర్కొన్నారు. రైతులు ఎక్కడా నష్టపోకుండా న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి మద్దతు ధర ప్రకటించారని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ వారు రైతులకు చెల్లించాల్సిన ధర ఎనిమిది రూపాయలు, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు చెల్లిస్తుందని తెలిపారు. ప్రతి రైతు చివరి పంట వరకు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు రైతులు ఎలాంటి తొందరపాటు లేకుండా పంట కోత కోయవద్దని, మామిడి పక్వానికి వచ్చిన తరువాతే కోయాలని తెలిపారు. చివరి కేజీ వరకు ప్రభుత్వం ప్రతి రైతుకి నాలుగు రూపాయల సబ్సిడీ ఇస్తుందరు. రైతులు మండీలు, ట్రేడర్స్ గుజ్జు పరిశ్రమల దగ్గరికి తొందరపడి వెళ్లవద్దని దిగుబడి రాకముందే కోతకోయొద్దని తెలిపారు. అనంతరం గంగాధర మండలంలోని జైన్ కంపెనీలో రాంపులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాంపుల వద్ద ఉన్న రైతులతో రాంపుదారులు చెల్లిస్తున్న ధరలపై కలెక్టర్ ఆరా తీశారు. పూతలపట్టు మండలంలో గల్లా శ్రీ సన్నిధి మామిడి గుజ్జు పరిశ్రమలో రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ రాంపు వద్ద విఆర్వోలను పోలీస్ కానిస్టేబుల్‌ను తప్పనిసరిగా ఉంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు తక్కువ ధర చెల్లించకుండా చూడాలన్నారు. రైతులకు తాగునీరు, భోజనం వసతి కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ర్యాంపుల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేస్తున్నామని రైతులు ఈ క్రాఫ్ చేయకున్నా మామిడికి అదనపు ధర కల్పిస్తామని తెలిపారు. చిత్తూరులోని శ్రీరాం కంపెనీని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ పక్వానికి వచ్చిన కాయలే పరిశ్రమలకు తీసుకురావాలని రైతులకు తెలిపారు. ఎలాంటి సందేహాలు వున్నా కంట్రోల్ నెంబర్లు 9491077325,08572-242777కు ఫోను చేయాలని తెలిపారు.



సన్నిధి జ్యూస్ ఫ్యాక్టరీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రైతులకు కలెక్టర్ సుమిత్ కుమార్ భరోసా



గంగాధర నెల్లూరులో



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మేయర్ అముద

సమస్యలు సకాలంలో పరిష్కరించండి: మేయర్

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్ : ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మేయర్ ఎస్ అముద అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారి కార్యాలయం ప్రజా దర్బార్ లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి వేగంగా పరిష్కరించాలన్నారు. శుక్రవారం నాటి కార్యక్రమంలో మొత్తం 22 వినతులు అందాయి. ఎంఈ వెంకటరామి రెడ్డి, డిప్యూటీ తహశీల్దారు ఇబ్రహీం, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి !

- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం
- ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్న వైనం
- మారని కార్పొరేట్ విద్యా సంస్థల తీరు

ప్రజాశక్తి -పుంగనూరు: కార్పొరేట్ విద్యా సంస్థలు నిబంధనలు గాలికి వదిలేశాయి. ఆ విద్యా సంస్థల్లో చేరుతున్న అందరి వద్దా పలు రకాల పేర్లతో లక్షల రూపాయల ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కార్పొరేట్ విద్యా సంస్థల తమ ఇష్టానుసారం బోధన సాగిస్తున్నాయని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు పట్టణంలో సుమారు 15 ప్రైవేట్ స్కూల్స్(కార్పొరేట్ విద్యా సంస్థలు) వున్నాయి. వీటిలో కొన్ని ప్రభుత్వం నిబంధనలు అసలు పాటించలేదనే విమర్శలు జోరుగా సాగుతున్నాయి. మరి కొన్ని పాఠశాలల్లో ఆట స్థలాలు లేవు.. కార్పొరేట్ విద్యా సంస్థలు పాటించాల్సిన నియమ నిబంధనలు ఏమాత్రం అనుసరించడంలేదని లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు స్కూలు నుండి ఓ వైపు విద్యాశాఖ, మరికొన్ని ప్రభుత్వ శాఖలు మామూలు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారుకారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్పొరేట్ విద్యా సంస్థలు వారు ఆడింది ఆటగా , పాడిండి పాటగా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

ముక్కు పిండి వసూలు చేస్తున్న ఫీజులు


విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక సమస్యలు తలెత్తుతాయి. ఏదో ఒక రకంగా ప్రైవేట్ స్కూల్లో తమ బిడ్డలను చదివించాలని తహతహలాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలను కార్పొరేట్ విద్యా సంస్థలు అవకాశాలుగా మలుచుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లలకు కావలసిన యూనిఫాం, ఐడీ కార్డు, బుక్స్ అమ్మకాల్లో రూ.20వేల నుంచి రూ.25 వేలు వెచ్చించాల్సి వస్తోంది. యూనిఫాం, టై, బుక్స్ అక్కడే కొనాలని నిబంధనలు విధిస్తున్నారని ఆవి కొనాలన్నా ట్రేడ్ లైసెన్స్ ఉండదని, జీఎస్టీ చెల్లించరని, తమ వద్ద మాత్రం ఫీజుల దోపిడీ చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

విద్యా సామగ్రి కొనుగోలు చేయాలని నిబంధన

స్కూల్ ఫీజులే కాకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని సామగ్రి ఆయా కార్పొరేట్ స్కూళ్లలోనే కొనుగోలు చేయాలనే నిబంధనలు విధిస్తున్నారు. ఐడీ కార్డు, టై, బెల్ట్, సాక్స్, షూ, యూనిఫాం, పుస్తకాలు అన్ని అక్కడే కొనాల్సి వుంది. అత్యధిక శాతం కార్పొరేట్ స్కూళ్లలో వీటి ధరలు 50 నుంచి 60 శాతం అదనంగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ స్కూళ్ల నిలువు దోపిడీని నియంత్రించాలని , ఇందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు గాలికి !

ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలే ఉంటాయి. కార్పొరేట్ స్కూళ్లలో తాము సొంతంగా తయారు చేసుకున్న 'కరికులం' (సిలబస్) తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నాయి. కార్పొరేట్ స్కూళ్లలో విద్యతో పాటు విద్యా సామగ్రి అమ్మకాలు జరిపితే ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలి. జీఎస్టీ చెల్లించాలి. అధికశాతం స్కూళ్లలో ట్రేడ్ లైసెన్సు లేకుండా, జీఎస్టీ చెల్లించకుండానే విద్యాసామగ్రి అమ్మకాలు సాగించి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారనే విమర్శలు వున్నాయి. అయా కార్పొరేట్ స్కూళ్లు తయారు చేసుకున్న సొంత సిలబస్ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలపై ఆయా స్కూళ్ల పేర్లు ముద్రించుకుంటున్నారు. ఇలా పేరు ముద్రిస్తే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నిటినీ బేఖాతర్ చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న కొన్ని కార్పొరేట్ స్కూళు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు దోచేస్తున్నాయి. ఎల్‌కెజి నుండి పదో తరగతి వరకు విద్యనందించే కార్పొరేట్ స్కూళ్లలో పలుపేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. యూనిఫాం, ఐడీ కార్డు, పుస్తకాలకే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అవుతుంది. తొలుత అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ట్రాన్స్‌పోర్టు ఫీజు, లైబ్రరీ ఫీజు, క్రీడా సామగ్రి ఫీజు, ఇలా పలు రూపాలలో ఎల్‌కేజీ స్థాయి నుంచే లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో క్రీడా మైదానాలు కనిపించవు. పీఈటీలు ఉండరు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని అత్యధిక కార్పొరేట్ స్కూళ్లలో ఇదే తీరు కొనసాగుతోంది. కనీసం వంద మంది విద్యార్థులకు ఒక ఫిజికల్ డైరెక్టర్ ఉండాలి..డ్రిల్ మాస్టర్‌గా పిలువబడే పీడీలను కొన్ని స్కూళ్లలో కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకుంటున్నారు. ఒక ఫిజికల్ డైరెక్టర్ 5, 6 స్కూళ్లలో డ్రిల్ క్లాసులకు హాజరైనట్లు నమోదు చేసుకుంటూ హాజరు పట్టికలు చూపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫిజికల్ డైరెక్టర్‌ను పూర్తి స్థాయిలో నియమిస్తే రూ. 20 వేల నుంచి 25 వేలు జీతం ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో రూ.4 లేక 5 వేలు మాత్రమే ఇచ్చి అటెండెన్స్ రిజిష్టర్లలో డ్రిల్ క్లాసు నిర్వహిస్తున్నట్టు చూపించుకుంటున్నారు.



జీఎస్టీని ఎగ్గొడుతున్న వైనం

తమ పిల్లలను పెద్ద చదువులు చదివించాలనే ఉద్దేశంతో పేదల పిల్లల తల్లిదండ్రులు సైతం కార్పొరేట్ స్కూళ్లవైపు ఆకర్షితులవుతుంటే అదే అదనుగా కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు దోపిడీకి తెర తీస్తున్నాయి. ఒకవైపు ఫీజులతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ వంటి వాటిని నొక్కేస్తున్నారు. సామాన్యశాస్త్రం, చరిత్ర వంటి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం తగ్గించి ఐఐటీ ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక సిలబస్ ఇవ్వడం వల్ల చరిత్ర, భౌగోళిక శాస్త్రాలకు సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన ఉండడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ పొదుపు ఏదీ?

రేయింబవళ్లు వెలుగుతున్న పంచాయతీ వీధి లైట్లు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండ లంలోని పలు పంచాయతీలలో పంచాయతీకి సంబంధించిన వీధి లైట్లు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అటు పంచాయతీ అధికారులు కానీ, ఇటు విద్యుత్ శాఖ సిబ్బంది గానీ దీన్ని పట్టించుకోకపోగా విద్యుత్ పొదుపు పాటించే సంగతి తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. ఎంతైనా ప్రభుత్వ సొమ్మే కదా? అని ఇంత నిర్లక్ష్యమా? అని పలువురు వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు విద్యుత్ దీపాలను నియంత్రించేందుకు తగిన సిబ్బందిని నియమించి విద్యుత్ వినియోగాన్ని సక్రమంగా వుండేలా అధికారుల్లో స్పందన , పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలా జరుగుతోందని ఇకనైనా మండల, జిల్లా స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

పలమనేరు ఎస్ఐగా లోకేష్‌రెడ్డి

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు ఎస్ఐగా ని లోకేష్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేసి బదిలీపై పలమనేరుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నరసింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేసినట్లు తెలిపారు.

మామిడి గుజ్జు పరిశ్రమ పరిశీలన

ప్రజాశక్తి-తవణంపల్లె: మండలం లోని గాజులపల్లెలోని మామిడి గుజ్జు పరిశ్రమను తహశీల్దార్ సుధాకర్ శుక్రవారం పరిశీలించి గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీసి రైతులు 3,4 రోజుల నుంచి ఫ్యాక్టరీ ముందు వేచి వుంటున్నారని తాము తీవ్ర ఇబ్బంది కరమైన పరిస్థితి ఎదుర్కొంటున్నామని రైతులు తహశీల్దారు సుధాకర్‌కు తెలిపారు. దీంతో తహశీల్దారు గుజ్జు పరిశ్రమ యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. రెండు మూడు 2,3 టన్నులు వున్న రైతులు సోమవారం నుండి టోకెన్ లు ఇస్తామని చిన్న సన్న కారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తహశీల్దారు సుధాకర్ తెలిపారు.

ఎస్ఆర్ పురం: రైతుల్లో అభ్రద్రతాభావం పోగొట్టడం కోసం ప్రతి రైతు వద్ద నుంచి ప్రతి కాయను కొంటాం అన్న దీన్ని ధైర్యాన్ని రైతులను కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దార్ లోకనాథపిళ్ళై మండలంలోని జంగాల పల్లి రోడ్డు పక్కన ఉన్న బై నేచర్ మామిడి గుజ్జు పరిశ్రమను శుక్రవారం సందర్శించారు. ఫ్యాక్టరీ వారు జారీ చేసే టోకెన్ విధానం , ఫ్యాక్టరీ లో ప్రాసెసింగ్, క్యూలైన్ మేనేజ్మెంట్ లను పరిశీలించారు. అనంతరం ప్రతి రైతు నుంచి మామిడి కొనుగోలు చేయాలని మేనేజర్ కరుణాకర్ రెడ్డికి సూచించారు. రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ ఏర్పాటుచేసిన టీం సచివాలయ ఉద్యోగి, వీఆర్వో ఎంపీడీవో లతో కలిసి మూడు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి మామిడి రైతులు ధైర్యాన్ని నింపారు.

గుడిపాల తహశీల్దారు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- గుడిపాల: గుడిపాల నూతన తహశీల్దారుగా పూజారి శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసులు గతంలో తిరుపతి జిల్లా డిఎస్ఓ కార్యాలయంలో డిటిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై గుడిపాలకు వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దీనికి మండల ప్రజలు,ప్రజాప్రతినిధులు అందరూ సహకరించాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి,రిసర్వే డిటీ రూప దేవి,మండల సర్వేయర్ గోపి, వీఆర్వోలు గోపి,శ్రీనాథ్ రెడ్డి,భవదీప్, రాజా రావు , జూనియర్ అసిస్టెంట్లు రెడ్డి ప్రసాద్, దుర్గాప్రసాద్ కంప్యూటర్ ఆపరేటర్లు చరణ్, కిరణ్ లతోపాటు వీఆర్ఏలు పాల్గొన్నారు.



ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- రామకుప్పం: ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను శుక్రవారం టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పెద్ద ఎత్తున కేక్ కత్తరించి ఒకరికొకరు పంచుకొని భువనేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం పేదలకు అన్న కాంటీన్ ద్వారా పెద్ద ఎత్తున అన్నదాన ం నిర్వహించారు. ఆమె ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీతాపతి, రామకృష్ణప్ప, సుబ్రి, రవి రెడ్డి, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

కోసలనగరం సింగిల్‌విండో సీఈవోగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -విజయపురం: కోసలనగరం సింగిల్‌విండో పీఏసీఎస్ సీఈవోగా సుబ్రహ్మణ్యం శుక్రవారం నియమితులయ్యారు. ఆయన అగరం రామకృష్ణా సింగిల్ విండో నుండి బదిలీపై ఉత్తర్వులు అందాయి. గతంలో ఇన్చార్జి సీఈవోగా పని చేస్తున్న రాధపై పలు ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. సీఈవోను మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్ పూలమాలతో అభినందించారు.

యోగాతో వ్యక్తిత్వ వికాసం

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : నిత్యం యోగా సాధన చేయడం వల్ల వ్యక్తిత్వ వికాసాన్ని పొందవచ్చని బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు తెలిపారు. కుప్పం డిగ్రీ కళాశాల వేదికగా గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ శిక్షకులు ప్రాణాయామం చేయడం, యోగ ఆసనాలు వేయడం పై వారికి అవగాహన కల్పించారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర ఆరోగ్య ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు: ఆంధ్రప్రదేశ్ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నేడు నిర్వహించనున్న సందర్భంగా జిల్లా, మండల స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. అందరూ పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు.

ఎస్ఆర్ పురం : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగమ్మ గుడి పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : కుప్పం కడా ఆధ్వర్యంలో శనివారం యోగాంధ్ర ఆరోగ్య ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 1000 కేంద్రాలలో రెండు లక్షల మందికి పైగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నట్టు తెలిపారు. ప్రజలలో ఆరోగ్య స్ఫూర్తిని పెంపొందించడానికి, శారీరక, మానసిక సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికా బద్ధంగా యోగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరగబోవు కార్యక్రమంలో సుమారు 5,000 మందికి పైగా ప్రజలు పాల్గొననున్నట్టు తెలిపారు.

కుప్పం ఎయిర్‌పోర్ట్‌కు బలవంతపు భూసేకరణ వద్దు

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: కుప్పం విమానాశ్రయం కోసం బలవంతంగా భూములు తీసుకోవద్దని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పేర్కొంది. ఈ మేరకు భూ పరిపాలన అధికారి జి జయలక్ష్మి ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రామసుందరరెడ్డికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు నేతృత్వంలో భూములు కోల్పోతున్న రైతులు శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పం ప్రాంతంలో శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో 9 రెవెన్యూ గ్రామాల్లో రెండు పంటలు పండే సారవంతమైన 1,135.95 ఎకరాల భూమిని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కోసం సన్నా, చిన్నకారు రైతుల నుంచి బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ పునరావాస చట్టాలన్నీ అమలు చేయాలని, భూసేకరణ కోసం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ 30ను రద్దు చేయాలని కోరారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గంలో మరో విమానాశ్రయం కట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఒక మారుమూల ప్రాంతంలో ఎవరి ప్రయోజనాల కోసం ఈ విమానాశ్రయం కడుతున్నారో ప్రజలకు చెప్పకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, ప్రజా అభిప్రాయాన్ని సేకరించకుండా అగ్ర పత్రికల్లో ప్రకటన ఇచ్చి, రైతులను, పేదలను బెదిరించి బలవంతంగా భూములు తీసుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా పోలీసులను ఉపయోగించి పేదల ఇళ్లకు వెళ్లి భూములు ఇవ్వాలని బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారని తెలిపారు. సిఎం సొంత నియోజకవర్గంలోనే చట్టాలను అమలు చేయకుండా, పేదలకు అన్యాయం చేసే పరిస్థితి నెలకొందన్నారు. ఈ బలవంతపు భూసేకరణ ఆపాలని ఇప్పటికే ఎంఆర్ఓ, ఆర్డిఓ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేశామన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను తీసుకుని, సారవంతమైన 3 పంటలు పండే భూములను మినహాయించాలని, లేనిపక్షంలో పెద్దయెత్తున ఆందోళనలు చేస్తామని చెప్పారు. ఈ అంశంపై సిపిఎల్ఎ జయలక్ష్మి స్పందిస్తూ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం చిత్తూరు జిల్లా కార్యదర్శి ఓబులరాజు, కుప్పం రెస్కో మాజీ ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, మహిళా రైతు లక్ష్మి, రామకుప్పం మండలం సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, దళిత రైతు నాయకులు గాంధీనగరం శ్రీనివాసులు, వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పెద్దన్న తదితరులు ఉన్నారు.

ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం పట్టణం ఉర్దూ స్కూల్‌లో శుక్రవారం పిల్లల తల్లి తండ్రులు, ముస్లిం సోదరులతో ఎంఈవో విజయకుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ ఉర్దూ స్కూల్ కి ఎన్నో సంవత్సరాల చరిత్ర కలదు 1 వ తరగతి నుండి 7 వ తరగతి వరకు విద్యార్థులకు మంచి ఉపాధ్యాయులతో ఉర్దూ బోధన చేస్తున్నారు, ఉర్దూ తో పాటు ఇంగ్లీష్, తెలుగు భాషల్లో కూడా బోధన ఉంటుందని, గ్రామస్థులు పిల్లల తల్లిదండ్రులు సహకరించి ఉర్దూ స్కూలులో పిల్లలను చేర్పించి, స్కూల్ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. స్కూలులో పిల్లలు నమోదు ప్రక్రియ పెరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 మనోజ్ కుమార్, గవర్నమెంటు ఖాజీ కే జాఫర్ అలీ, జిల్లా మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ సందాని, ఎంపిపి మెయిన్ స్కూల్ హెచ్ఎం మురుగేశన్, హెచ్ఎం, ఉర్దూ స్కూల్ హెచ్ఎం జబినా సుల్తానా, సహిత విద్యా ఉపాధ్యాయులు సింధూజ, రేఖ , ముస్లిం సోదరులు పిఎం షాజహాన్ ఖాన్ , ఖాదర్ షరీఫ్, ఇమ్రాన్, అబ్బాస్ పాల్గొన్నారు.



కేశవులు రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కర్ణాటక హోస్పేట వద్ద ఇటీవల ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు గ్రామానికి చెందిన కే కేశవులు రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే థామస్ అన్నారు. కేశవులురెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శుక్రవారం టిడిపి తరపున 5 లక్షల రూపాయలు ఆర్థికసాయం, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులు త్వరలో మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పిల్లలను ఉన్నత చదువులకు చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం నాయకులు లోకనాథ్ రెడ్డి మోహన్ మురళి, సుధాకర్ రెడ్డి, సుధాకర్, దామోదర్ రెడ్డి, భాస్కర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, మహేష్, చిన్నంరెడ్డి, విజయసింహారెడ్డి, నాగరాజు రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కంచర్ల రామయ్యకు ఘన నివాళులు

ప్రజాశక్తి- రామకుప్పం: ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, కుప్పం నియోజకవర్గం సమన్వయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీల ఛైర్మన్ కంచర్ల రామయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రామకుప్పం మండలం టిడిపి ముఖ్య నేతలు కంచర్ల రామయ్య భౌతిక కాయానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మున స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ముఖ్య నేతలు చిన్ని కృష్ణ, చలపతి, పత్రా నారాయణ, రామమూర్తి, కామరాజ్ నాయక్, గుర్రప్ప, కృష్ణనాయక్, కామరాజ్ నాయక్, జయశంకర్,చంద్రా రెడ్డి, గంటలప్ప గౌడు, నందా రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు రాయితీ విత్తనాలు

ప్రజాశక్తి -యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తుందని యాదమరి మండల వ్యవసాయ అధికారి దీపా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు యాదమరి మండలంలోని రైతు సేవా కేంద్రాలకు గ్రీన్ మ్యాన్యూర్ విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని అవసరమైన వారు తీసుకెళ్లవచ్చని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే మిన్న: సీఐ

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఎందులోనూ తక్కువ కాదని మిన్న అని వన్‌టౌన్ సిఐ మహేశ్వర అన్నారు. గురువారం స్థానిక హైరోడ్డులోని ప్రాఫిట్ షూ ఫోరూంలో పది పరీక్షల ఫలితాల్లో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించేలా ఆత్మీయ సత్కారం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సిఐ మహేశ్వర ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందిస్తూ ప్రశంస్యా పత్రాలు మెమొంటోలు అందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేడు కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు పుట్టుకొచ్చాయని అయితే గతంలో అనేక మంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. ప్రాఫిట్ షు కంపెనీ ఎండి కోటేశ్వర్ ఆదేశాల మేరకు ఏపి, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలోని 100 షోరూంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులకు ఆత్మీయ సత్కారం పేరిట సత్కరింస్తున్నట్లు ప్రాఫిట్ షూ కంపెని ఏరియా మేనేజర్ యార్లగడ్డ మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టోర్‌రూం మేనేజర్ భాస్కర్, హెచ్ఎం హుసేన్‌భాషా, లిటిల్ ఫ్లవర్ స్కూల్ హెచ్ఎం దిషిత ఉత్తమ మార్కులు సాధించిన కౌసర్ హుసేన్ 582 మార్కులు, సుమియా భాను 581 లిటిల్‌ఫ్లవర్ విద్యార్థులను సిఐ ఘనంగా సత్కరించి బహుమతులను ప్రదానం చేశారు.



రాయితీ పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పాడి రైతులకు ప్రభుత్వ రాయితీ పశువుల దాణాను పశు సంచాలకులు శ్రీనివాసులు నాయుడు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1300 రూపాయల విలువచేసే పశువుల దాణా రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా 555 రూపాయలకు ఇస్తోందని, దాణాను పశువులకు అందిస్తే పాల ఉత్పత్తి బాగా పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. పశువులకు ఇన్సూరెన్స్ చేసిన రైతులకు, పేద రైతులకు ప్రాధాన్యత క్రమంలో పశువుల దాణా అందిస్తున్నామని మూడు సంవత్సరాలకు 300 రూపాయల ఇన్సూరెన్స్ చెల్లించడం ద్వారా ఆవు మరణిస్తే రైతుకు ఇన్సూరెన్స్ అందిస్తామని తెలిపారు. దీనివల్ల రైతు నష్టపోకుండా ఉండొచ్చని ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. ఇప్పటికే 25 మెట్రిక్ టన్నుల పశువుల దాణా మండలానికి వచ్చిందని పంపిణీ చేశామని మరో 25 టన్నుల దాణా రానుందని ప్రాధాన్యత క్రమంలో అందరూ రైతులకు అందిస్తామని తెలిపారు. పశువులు ఆరోగ్యంగా వుండాలంటే పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని అనారోగ్య బారిన పడినప్పుడు వైద్యశాలకు తీసుకొచ్చి వైద్యుల సలహాలతో టీకాలు వేయించాలని కోరారు.ఈ సమావేశంలో పశువైద్యాధికారిణి చందన ప్రియ, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పశువుల దాణాను పంపిణీ చేసిన అధికారులు

మామిడి కేజీ రూ.3 ?

దిక్కుతోచని స్థితిలో మామిడి రైతులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రాంపుల్లో తోతాపురం కేజీ మామిడి మూడు రూపాయలకే కొనుగోలు చేస్తున్నారు. గతంలో కలెక్టర్, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పలు దఫాలు చర్చలు జరిపి మామిడి ధరలు నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేపట్టక పోగా శుక్రవారం మండల కేంద్రంలోని రాంపుల వద్ద రైతుల నుండి మూడు రూపాయలకే కేజీ మామిడిని కొనుగోలు చేస్తున్నారు. రైతుకు రాంపుల వారు ఎనిమిది, ప్రభుత్వం రాయితీ నాలుగు రూపాయలు కలిపి పన్నెండు రూపాయలు రావాల్సి వుండగా మూడు రూపాయలు మాత్రమే వస్తుండడంతో మామిడి పంట దిగుబడి కోసం



పెట్టిన ఖర్చులు కూడా రాదని అలా అని మామిడి పంటను తోటల్లో వదిలేయడం వల్ల నష్టం ఏర్పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వంలో రెవెన్యూ అత్యంత కీలకం

విశ్రాంత తహశీల్దారు రమేష్

ప్రజాశక్తి-పూతలపట్టు: ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని బ్రిటిష్ కాలం నుంచి రెవెన్యూ ప్రాధాన్యత ఉన్నతమైందని విశ్రాంత తహశీల్దారు రమేష్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రజలతో మమేకమైనప్పుడే రెవెన్యూ శాఖకు ఉన్నతమైన గౌరవం లభిస్తుందన్నారు. రెవెన్యూ శాఖలో సహ ఉద్యోగులను గౌరవించుకోవడం లో ప్రాధాన్యత ఉండాలన్నారు. అనంతరం మరో ముఖ్య అతిథి విశ్రాంత తహశీల్దారు సుధాకరయ్య మాట్లాడుతూ మానవునికి మెదడు ఎంత ముఖ్యమో సమాజంలో రెవెన్యూ కూడా అంతే ముఖ్యమన్నారు. రెవెన్యూలో ఉద్యోగాలు పొందడం ప్రతి ఒక్కరి అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత తహశీల్దారు రమేష్ బాబు, డిటిలు మునికృష్ణ, కవిత, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత తహశీల్దారు

సిబ్బంది ద్వారానే వారి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని, అంతేకాకుండా రెవెన్యూ సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూసుకుంటూ వారి కర్తవ్యాన్ని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేలా సిబ్బంది సహకరించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దారు కార్యాలయాన్ని ముస్తాబు చేసి ముగ్గులతో అలంకరించి వేడుకలు నిర్వహించారు. తమశీల్దారు ఎంఎస్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మండలంలో పుట్టే బిడ్డనుండి మరణించేంతవరకు రెవెన్యూ


బైరెడ్డిపల్లిలో రెవెన్యూ దినోత్సవంలో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

జాబ్ మేళాలో 146 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో జాబ్ మేళా నిర్వహించగా 146 మంది ఉద్యోగ అవకాశాలు లభించాయి. శుక్రవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సీడ్ అప్ సంయుక్తంగా గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే మా ఏకైక లక్ష్యమన్నారు. ఎన్నికలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట కట్టుబడి ఇప్పటికే రెండు కంపెనీలను స్థాపించే పనిలో నిమగ్నమయ్యామన్నారు. అందరి కళ్ళల్లో ఆనందం చూడాలని తాను ఉన్నత స్థాయి వైద్య వృత్తి నుండి రాజకీయానికి వచ్చానన్నారు. ఇప్పటికే ప్రముఖ పాలీహౌస్, భారత్ బయోటెక్ లాంటి ఉన్నతమైన కంపెనీలను గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి తేవడానికి చర్యలు చేపట్టినట్లు ఆయన హామీ ఇచ్చారు. దీని ద్వారా ఒక సంవత్సరంలో దాదాపు 200 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా మెగా జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్ మేళాలో 17 జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు ఈ జాబ్ మేళాలో సుమారు 423 మంది హాజరు కాగా వీరులో 146 మంది ఉద్యోగ అవకాశాలు పొందారు ఉద్యోగాలు పొందిన వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి గుణశేఖర్ రెడ్డి, ఎంపీడీవో కృష్ణ మహేష్ రెడ్డి, కూటమి నాయకులు కృష్ణమ నాయుడు, స్వామి దాస్, శ్రీధర్ యాదవ్, దేవ సుందరం, పొన్నా యుగంధర్ రాజేంద్రన్, దీపక్ చౌదరి, జయశంకర్ నాయుడు, కోదండ రెడ్డి, హరీష్ యాదవ్, జ్యోతి యాదవ్, బాబు నాయుడు, మోహన్ నాయుడు, శాంత్ కుమార్, జీవరత్నం, పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

మా స్థలంలో అక్రమంగా పాఠశాల నిర్మించారు

లబ్ధిదారుడు నిరసన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండల కేంద్రం పుల్లూరు క్రాస్ రోడ్ లో తన భార్య బిఆర్. కృష్ణవేణి పేరుమీద సర్వేనెంబర్ 35 /4 లో 2000 సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇదే మండలానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా పాఠశాల నిర్మించాడని కృష్ణవేణి భర్త రాజేంద్రనాయుడు శుక్రవారం పాఠశాల వద్ద ప్లే కార్డులు బ్యానర్ తో నిరసన తెలిపాడు. ఈ పాఠశాల నిర్మించిన వ్యక్తికి ఎస్ఆర్ పురం లెక్క దాఖలు 31 / 3 ఏ లో స్థలం ఉందని అయితే పాఠశాల నిర్మాణం మాత్రం తన స్థలంలో నిర్మించాడని వాపోయారు. ఈ విషయంపై గత మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ మధ్యకాలంలో పాఠశాల ను చిత్తూరులోని ఓ ప్రైవేటు పాఠశాలకు ఈ పాఠశాలలను విక్రయించి నట్లు బోర్డు పెట్టడంతో తాను ప్రత్యక్ష నిరసన కు దిగినట్లు తెలిపారు. ఈ స్థలంలో తాను నిర్మాణాలు చేపడతానని.. ఈ స్థలాన్ని అమ్మే అధికారం పాఠశాల యజమానికి లేదని, కొత్తగా కొన్న పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. దీనికి సంబంధించి తనకు ప్రభుత్వం ఇచ్చిన డి ఫారం మరియు పాఠశాల యాజమాన్యానికి ఉన్న స్థలం రికార్డులను చూపించారు.



ఏనుగల నుండి రైతులకు రక్షణ కల్పించండి: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఇటీవల కాలంలో.. చిత్తూరు పార్లమెంటు పరిధిలో.. గజరాజులు బీభత్సం సృష్టిస్తున్న నేపథ్యంలో అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని వారి ప్రాణాలకు భద్రత కరువైందని ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు గ్రహించి, రైతుల రక్షణకు కల్పించాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సంబంధిత అధికారులకు సూచించారు. అదే సమయంలో ఏనుగుల బారి నుండి పంట పొలాలు, ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో అడవులకు సమీపంలో ఉన్న పంట పొలాల పై గజరాజులు విరుచుకుపడుతూ బీభత్సం సృష్టిస్తున్న విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం ఢిల్లీ నుంచి స్పందించారు. ఏనుగుల రాకను అడ్డుకునేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినా.., ఏదో మార్గాన అడవుల నుంచి ఏనుగులు జనావాసాల్లోకి వస్తూ అలజడి సష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు కూడా ఆమేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నా.. గజరాజులు తమ ఉనికిని చాటుతూ రైతన్నలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు. దీంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారిని రక్షించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మద్యం సేవించి వాహనాలు నడపడం, నడిపిన బహిరంగంగ మద్యం తాగిన ఆరుగురికి జరిమానా విధించారు. చిత్తూరు రెండవ పట్టణ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య డ్రంక్ అండ్ డ్రైవ్ ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని రెండవ తరగతి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన నలుగురికి రూ.40,000 జరిమానా, బహిరంగంగా మద్యం తాగిన ఇద్దరికి రూ.2,000 జరిమానా విధించారు. మొత్తం రూ.42,000 జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా రెండవ పట్టణ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి. ఈ రకమైన చర్యలు తీవ్రంగా తీసుకుంటామని, ఎవ్వరైనా నియమాలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తామని" హెచ్చరించారు.


స్టాక్ పాయింటును తనిఖీ చేస్తున్న అధికారులు

స్టాక్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం నెల్లిమంద ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ కేశవరెడ్డి సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్ ను ఎంఈఓ శివరత్నమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కేశవరెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తూ ఉచితంగా అందజేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఎంఈఓ శివరత్నమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందజేసేందుకు గాను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం ద్వారా ప్రభుత్వం అందించే స్కూల్ బ్యాగు బెల్టు షు, సమ రూప వస్త్రాలను స్టాక్ పాయింట్ నందు భద్రపరచడం జరిగిందని వీటిని మండలంలోని అన్ని పాఠశాలలకు త్వరలో అందజేసి విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య సిఆర్పీలు సోమశేఖర్ ,సురేంద్ర డేటా ఎంట్రీ ఆపరేటర్ అస్లాం, నారాయణ పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలం బండ కింద పల్లి గ్రామం సచివాలయంలో శుక్రవారం రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. గత వారం నుంచి జిల్లాలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నా, బండ కింద పల్లి రైతు భరోసా కేంద్రం సిబ్బంది నరసింహులు నిర్లక్ష్య ధోరణితో రైతు భరోసా కేంద్రాన్ని తెరవకుండా తాళాలు వేసి రైతులకు ఇబ్బందులు కలిగించారు. గ్రామంలోని రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం వ్యవసాయ అధికారిని శ్రావణి, తమ సిబ్బందితో అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది నరసింహులు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వేరుశనగకాయలు విత్తనాలు సమయానికి ఇవ్వకుండా, కార్యాలయంలో అందుబాటులో లేకుండా ఉంటున్నారని రైతులు ఏవో శ్రావణి కి ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు సి ఓబులేశ్వర్ రెడ్డి, వి. మదన్మోహన్ రెడ్డి, వాటర్షెడ్ ఛైర్మన్ భాస్కరయ్య, రమణారెడ్డి, కోటీశ్వర రెడ్డి, వీర, సర్పంచ్ అన్సర్ భాష, భాస్కర్ రెడ్డి, పెద్ద గొట్టిగల్లు గ్రామస్తులు, బండ కిందపల్లె రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల అధికారులు

గిట్టుబాటు ధర సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-సోమల: మామిడి పంటకు ప్రభుత్వం అందిస్తున్న కిలోకు నాలుగు రూపాయల మద్దతు ధరను మామిడి రైతులు సద్వినియోగం చేసుకొని కాయలు అమ్ముకోవాలని తహశీల్దారు బెన్ను రాజు, ఎంపీడీవో నారాయణ కోరారు. శుక్రవారం పెద్ద ఉప్పరపల్లి ,తమ్మి నాయుని పల్లి, పొదలకుంటపల్లి, అన్నెమ్మ గారి పల్లి, నంజంపేట సచివాలయాలలో గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. పక్వానికి వచ్చిన కాయలు కోసి ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాలలో కాయలు అమ్మకాలు చేసి ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకొని రైతులు నష్టాలనుండి గట్టెక్కాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లలిత కుమారి, మణికుమార్, వీఆర్వోలు పురుషోత్తం, భారతి, ప్రసాదు, వెంకటనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సమయం పెంపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చిత్తూరు మండల తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ నగర కార్యదర్శి దాసరి చంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మికుల పోరాటాల ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. 8 గంటల పని విధానం అనేది శాస్త్రీయమైన ఆలోచన విధానమని ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రోజుకి 24 గంటల్లో 8 గంటల పని, 8 గంటల కుటుంబ సేవలు, 8 గంటల నిద్ర అనేది ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించిన విజయమని ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు. కార్మిక వర్గం ప్రాణాలర్పించి సాధించుకున్న చట్టాలను బడ కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేయడానికి ప్రభుత్వాలు తహతహలాడుతోందని తీవ్రంగా విమర్శించారు. సమయం పెంపు విధానం ఉపసంహరించుకోవలని కోరారు.